# న్యాయమూర్తిపై దాడి న్యాయ వ్యవస్థను అవమానించినట్టే

- న్యాయాన్ని పరిరక్షించే వాళ్లపై దాడులు సమాజానికి చేటు
- దాడులు జరుగుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్టు?
- కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి



**ప్రజానావ, కరీంనగర్:** 'రాష్ట్రంలో, దేశంలో నిత్యం ఏదో ఒకచోట న్యాయవాదులపై, న్యాయమూర్తుల దాడులు జరగడం బాధాకరం. ఈ దాడులు న్యాయ వ్యవస్థపైనే నమ్మకం కోల్పోయేలా చేయడమే కాకుండా న్యాయవ్యవస్థనే అవమానించేలా నేరప్రవృత్తి ఉన్న కొంతమంది ప్రవర్తిస్తున్నారు. ఈ దాడులను అరికట్టాలంటే కఠినమైన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి' అని కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో 9వ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మహిళా న్యాయమూర్తి పై గురువారం కరణ్ సింగ్ అనే కరడుగట్టిన నేరస్థుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ న్యాయాన్ని పరిరక్షించే వాళ్లపై నిత్యం దాడులు చేయడం సమాజానికి మంచిది కాదని, సమాజంలో ఒక న్యాయవ్యవస్థ పైనే నమ్మకం ఉందనే విషయం ప్రభుత్వాలు గమనించాలని, దాడులు ఇలాగే జరుగుతుంటే న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోతుందన్నారు. కొంతమంది వ్యవహరిస్తున్న తీరును ప్రభుత్వాలు గమనించి అరికట్టే విధంగా న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాల్సిందేనని బేతి మహేందర్ రెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యక్షులు టీ.రఘువీర్, లైబ్రరీ సెక్రటరీ కే. రాజేందర్, సీనియర్, జూనియర్ కార్యవర్గ సభ్యులు సుంకే దేవకిషన్, బెజ్జంకి శ్రీకాంత్ తో పాటు పెంచాల ప్రభాకర్ రావు, సిరికొండ శ్రీధర్ రావు, బలరాం, సంపత్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ పమేల సత్పతికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. ఆయన వెంట మాజీ కార్పొరేటర్లు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.
- ప్రజానావ, కరీంనగర్

# రామప్పను సందర్శించిన విదేశీయులు



**ప్రజానావ, వెంకటాపూర్ (రామప్ప):** మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ఆస్ట్రియా దేశానికి చెందిన వ్యక్తులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ప్రసాదం, ఆశీర్వచనాలు అందించారు. అనంతరం గైడ్ ద్వారా రామప్ప చరిత్ర, కట్టడం, శిల్పకళా నైపుణ్యం గురించి వారికి వివరించారు. రామప్ప కట్టడం చాలా అద్భుతంగా ఉందని వారు కొనియాడారు. అనంతరం రామప్ప చెరువు అందాలను తిలకించారు.

# అదనపు కలెక్టర్ తల్లికి నివాళులు



**ప్రజానావ, ములుగు:** ములుగు జిల్లా అదనపు కలెక్టర్, సివిల్ సప్లై అధికారి మహేందర్‌జీ తల్లి రాధా బాయ్ మృతి చెందగా, శుక్రవారం అదనపు కలెక్టర్ స్వగృహం రఘునాథపల్లి మండల కేంద్రంలో రాధా బాయ్ పార్థీవ దేహానికి ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట రైస్ మిల్లర్లు వాసుదేవ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**ప్రజానావ, దౌల్తాబాద్:** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొల్లపల్లి చైత్రం తండాకు చెందిన రవినాయక్, గ్రామానికి చెందిన ఎర్రం శ్రీనివాస్ తమ ద్విచక్ర వాహనంపై చేగుంటకు వెళ్తుండగా బైపాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రవినాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎర్రం శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

# కుల గణన, ఎస్సీ వర్గీకరణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## పాల్గొన్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు

**ప్రజానావ, దౌల్తాబాద్:** హైదరాబాద్ గాంధీ భవన్‌లోని ప్రకాశం హాల్‌లో శుక్రవారం జరిగిన కుల గణన, ఎస్సీ వర్గీకరణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్, ఏఐసీసీ సెక్రెటరీ సంపత్ కుమార్ కులగణన, ఎస్సీ వర్గీకరణపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలాపురం కనకయ్య యాదవ్, పాతూరి వెంకటస్వామి గౌడ్, ఖానాపూర్ బ్లాక్ అధ్యక్షుడు కడార్ల గంగ నరసయ్య, దౌల్తాబాద్, రాయపోల్, మిరుదొడ్డి మండలాల అధ్యక్షులు పడాల రాములు, తప్పేట సుధాకర్, మిద్దెల రాజేశం, దౌల్తాబాద్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారి లాలు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు పీ. శశికాంత్, మిరుదొడ్డి ఉపాధ్యక్షుడు ఎండీ హర్షద్ తదితరులు పాల్గొన్నారు.



# కులగణన శాస్త్రీయంగా నిర్వహించాలి

## చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి : ఎంపీ రవిచంద్ర డిమాండ్




**ప్రజానావ, ఖైరతాబాద్:** తప్పులతడక సర్వేను బుట్టదాఖలు చేసి కులగణనలో ప్రజలందరిని భాగస్వాములను చేసి తాజాగా, శాస్త్రీయంగా రీసర్వే చేపట్టాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల జరిపించిన సర్వే, నిండు శాసనసభ సాక్షిగా వెల్లడించిన నివేదిక చిత్తు కాగితంతో సమానమని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఎంపీ రవిచంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తూతూ మంత్రంగా సర్వే జరిపించిందన్నారు. బీసీలతో పాటు అన్నివర్గాల ప్రజలు దీనిని పూర్తిగా తిరస్కరించారన్నారు. రాష్ట్ర ఏర్పాటు జరిగిన తొలినాళ్లలోనే (2014 ఆగస్ట్ 17న) మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒక్కరోజులో జరిపించిన సమగ్ర కుటుంబ సర్వే (ఎస్‌కేఎస్)లో దేశవిదేశాల నుంచి వచ్చిన తెలంగాణ వాళ్లంతా పాల్గొన్న విషయాన్ని ఎంపీ రవిచంద్ర ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్‌కేఎస్ ప్రకారం బీసీల జన సంఖ్య కోటి 85లక్షల 61వేల 856 (1,85,61,856) కాగా (51శాతం),పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వే కోటి 64లక్షల 9వేల 179 (1,64,09,179)(46.25 శాతం)అని పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బీసీ జనాభా 21లక్షల 52వేల 677 తగ్గినట్లు చూపడం అసంబద్ధంగా ఉందని ఎంపీ వద్దిరాజు తెలిపారు. ప్రతి పదేళ్లకొకసారి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జరిపించే లెక్కల ప్రకారం జనాభా 13.5 శాతం పెరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్లు 3 కోట్ల 35లక్షలు కాగా,18ఏళ్ల లోపు వాళ్లు 25% ఉంటారనే,3 కోట్ల 90 లక్షల మందికి పైగా ఉన్న ఆధార్ కార్డుల ప్రకారం జనాభా 4 కోట్ల 30 లక్షలకు మించుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి మండలిలో 9మంది బీసీలకు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారని, ఖాళీగా ఆరు స్థానాలను బీసీలకే కేటాయించాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోతి కిశోర్, వివేక్ రాజు, కొండపల్లి శ్రీనివాస్ యాదవ్, గోపగాని రఘు తదితరులు పాల్గొన్నారు.




# సరైన పత్రాలు చూపి వాహనాలను తీసుకెళ్లండి

## ఎస్పీ అఖిల్ మహాజన్

**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పలు సందర్భాల్లో స్వాధీనం చేసుకున్న 64 వాహనాల యజమానులు సరైన పత్రాలు చూపి వాహనాలను తీసుకెళ్లాలని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇందులో ఆటోలు 6, కార్లు 3, ద్విచక్రవాహనాలు 55 ఉన్నాయన్నారు. ఈ వాహనాలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కి తరలించడం జరిగిందని, వాహనాల యజమానులు ఆరు నెలల వ్యవధిలో సరైన ధ్రువ పత్రాలను చూపించి తిరిగి తీసుకోవచ్చన్నారు. ఒకవేళ వాహన యజమానులు లేకపోతే కుటుంబ సభ్యులు సరైన పత్రాలు చూపెట్టి తీసుకెళ్లాలన్నారు. వాహనాలను ఎవరూ తీసుకెళ్లకపోతే ప్రభుత్వ నిబంధనలను అనుసరించి వేలం వేయడం జరుగుతుంది వివరించారు. ఇతరత్రా సమాచారం కోసం 87126 56428 ,90009 10619 ఫోన్ నంబర్లలను సంప్రంచాలని సూచించారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం జై సేవాలాల్ భూక్యా రెడ్డి తండా, గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 286 జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించడం చాలా అభినందనీయమని అన్నారు. ప్రజల కోసం సేవాలాల్ అనేక ఉద్యమాలు చేశారన్నారు. సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడుస్తూ జాతి ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు డా.రాజకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్, నరేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా,చేపూరి గంగాధర్,ఆజిమ్, పెంతల శ్రీనివాస్,ఆలయ చైర్మన్ రాజు, బల్కర్ రాజు, తిరుపతి నాయక్, రమేష్ నాయక్,రవి నాయక్,రాజు నాయక్, గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు బంజారా ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్

**ప్రజానావ, ఖైరతాబాద్:** ప్రభుత్వ బంజారా ఉద్యోగులకు ప్రభుత్వం శనివారం ప్రత్యేక క్యాజువల్ లీవ్ ప్రకటించింది. సేవాలాల్ జయంతి సందర్భంగా క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు క్యాజువల్ లీవ్ ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. క్యాజువల్ లీవ్ ప్రకటించడంతో బంజారా కమ్యూనిటీకి చెందిన ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని గొల్లలదొడ్డి దగ్గరున్న సేవాగఢ్‌లో జన్మించారని బంజారాల విశ్వాసం. ఆయన గొప్ప సంఘ సంస్కరణవాది. ఆధ్యాత్మిక గురువు. జగదంబకు అత్యంత ప్రియ భక్తుడు. బ్రహ్మచారి అయిన సేవాలాల్.. తన అద్వితీయ బోధనలతో యశస్సును పొందారు. బంజారాల హక్కులు, నిజాం, మైసూరు పాలకుల దాష్టీకాలకు వ్యతిరేకంగా.. 18వ శతాబ్దంలో సాగిన పోరాటంలో సంత్ సేవాలాల్ కీలక పాత్ర పోషించారు.

# కొమురవెల్లి మల్లన్న ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**ప్రజానావ, ఏటూరునాగారం:** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో ఫిబ్రవరి 26న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొముర వెల్లి మల్లన్న ఆలయ నిర్మాణ కమిటీ వ్యవస్థాపకులు గోగు మల్లయ్య జ్యోతిలు కొమురవెల్లి మల్లన్న పట్నాలు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. ఉత్సవాల గోడ పత్రికలను శుక్రవారం మంత్రి అనసూయ సీతక్క చేతులమీదుగా ఆవిష్కరించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, మండల అధ్యక్షుడు చిటమట రఘు, మాజీ జడ్పీటీసీ నామకరం చందు గాంధీ, నాయకులు జాడి రాంబాబు, ఖలీల్, వావిలాల నరసింహారావు, వావిలాల చిన్న ఎల్లయ్య, గద్దల నవీన్, ఎండీ అప్సర్, సర్వా ఆక్షిత్, పోలబోయిన గోపాల్, సాయి, గంపల శివకుమార్, గద్దల నవీన్, రమేశ్, ముతేశ్, హనుమంతు, గౌస్, శ్రీను, పాల్గొన్నారు.

